శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించండి



**నెల్లూరుకార్పొరేషన్, నవంబర్27, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ ప్రణాళికా బద్ధంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనులకు సహకరించాలని, డోరు టు డోర్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. పారిశుధ్యపనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక చిల్డ్రన్స్ పార్క్, బాలాజీనగర్ ప్రాంతాలను కమిషనర్ సోమవారం తనిఖీ చేశారు. స్థానిక ప్రజలతో కమిషనర్ ప్రత్యక్షంగా మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. డ్రైను కాలువల్లో వర్షపునీరు నిల్వకుండా అంతరాయం లేకుండా ప్రవహించేలా పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. నగరవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై వర్షపునీరు చేరి వాహన చోదకులు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వల్ల దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని అవగాహన కల్పిస్తూ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి నోటీసులు అందించాలని కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంజనా సింహ, నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికాఇర డాక్టర్ వెంకటరమణ, సూపర్వైజర్లు, శానిటేషన్ విభాగం సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బీఎల్‌వోలు బాధ్యతగా విధులు నిర్వహించాలి




**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవరనగ పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్ అధికారి వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని నుడా వైస్ చైర్మన్ , కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి పర్మినెంట్‌గా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, మృతిచెందిన వారి ఓట్లను తొలగించే విషయంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం మైగ్రేట్ అయిన వారి వివరాలు గుర్తించి వారి ఓట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి బీఎల్‌వో వారి వారి పరిధిలో ఇంకా ఎవరైనా 18 సంవత్సరాలు నిండి ఓటు నమోదు చేసుకోకపోతే అటువంటి వారిని డిసెంబర్ 9వ తేది లోగా ఓటు నమోదు చేసుకునేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగ 10 మందికి మించి ఒకే డోర్ నెంబర్‌లో ఓటరు నమోదై ఉంటే అటువంటి వారిని మరోసారి నిశితంగా పరిశీలించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 10 వేలు ఫారం-6,7,8 కు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని, ఆ దరఖాస్తులు నిశితంగా పరిశీలించి సకాలంలో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో తహసీల్దార్ ఎం. పద్మజ, ఎంపీడీవో శ్రీహరి పలు సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

## ఆడుదాం ఆంధ్ర క్రీడలు విజయవంతం చేయండి

**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడల్ని విజయవంతం చేయాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి, మండల క్రీడల ప్రత్యేకాధికారిణి పరిమిళ ఆదేశించారు. బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 27 నుండి 15 సంవత్సరాలు పైబడిన వారికి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడల కోసం మండలంలోని అన్ని సచివాలయాలలో రిజిస్ట్రేషన్లు ప్రారంభం చేసినట్లు తెలిపారు. ప్రతి గేమ్‌కు సచివాలయ పరిధిలో నాలుగు టీంలు వుండాలని అందులో రెండు మహిళా టీములు, రెండు పురుషుల టీములు వుండేటట్లు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. ఈ ఐదు క్రీడలకు సంబంధించి 20 టీములు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం వుందని, ఇంకా అవసరమైతే అధిక టీములు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. అనంతరం విశ్వనాధరావుపేట పంచాయతీ పరిధిలోని సచివాలయంలో రిజిస్ట్రేషన్ తీరుని పరిశీలించారు. కొంత మంది క్రీడాకారుల చేత ఆమె స్వయంగా రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వెంకట సుబ్బారావు, ఎంఇవో నరసింగరావు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## టిడ్కో గృహసముదాయాల రుణ మంజూరు వేగవంతం చేయండి



**నెల్లూరుకార్పొరేషన్, నవంబర్27, ప్రభాతవార్త** నెల్లూరు మున్సిపల్‌కార్పొరేషన్ పరిధిలో ఎపిటిడ్కో(జి+3) గృహాల రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ బ్యాంకు అధికారులను కోరారు. స్థానిక అల్లీపురంలోని 365, 430అడుగుల గృహాలకు సంబంధించి రుణాల మంజూరు పురోగతిని వివిధ బ్యాంకుల ప్రతినిధుల, హౌసింగ్ విభాగం అధికారులతో కలిపి కార్పొరేషన్ లోని డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డిశంబర్‌లోగా 8వ తేదీలోగా పెండింగ్‌లో ఉన్న అన్ని హౌసింగ్ రుణాలను మంజూరు చేయాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. గృహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారుల స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయాలని సిబ్బందిని ఆదేశించారు. టిడ్కో గృహాల్లో అన్ని మౌళిక వసతులు కల్పించి, లబ్ధిదారులకు అవసరమైన మంచినీరు, విద్యుత్, డ్రైన్లు, వీధిదీపాలు, కాలువలు, పచ్చదనం, రవాణా సౌకర్యాలు ఇంటిలోపల వైరింగ్‌లు ట్రాన్స్‌ఫార్మర్లు తదితర మౌళికసదుపాయాలను త్వరితగతిన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్‌ఈ జాన్‌సైమన్‌రావు, మెప్మా పీడీ రవీంద్ర, ఎల్‌డిఎమ్‌ప్రసాద్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏపిజీబి, యూకో, ఎస్‌బిఐ, కెనరా, యూనియన్ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సి, యమ్, యమ్‌లు, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## 1న జరిగే దళిత శంఖారావం విజయవంతం చేయాలి




**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** వచ్చేనెల 1వ తారీఖున నెల్లూరు నగరంలోని జరిగే దళిత శంఖారావాన్ని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో అబ్దుల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు జిల్లా టీడీపీ ఎస్సీనేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ సమాజంలో మార్పుకోసం ప్రతిఒక్కరూ రాజకీయాల్లోకి వచ్చామని, మిమ్మల్ని మీరు కాపాడుకుంటూ, సమాజాన్ని కూడా కోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు పక్కనపెట్టి రాజకీయాల్లో కష్టపడుతున్నామని, మనం చేసేకష్టం సమాజానికి దక్కాలన్నారు. మనంచేసే పని సమాజానికి ఉపయోగపడకపోతే రాజకీయాల్లో కొనసాగడం వ్యర్థమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, నెల్లూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు కాకి ప్రసాద్, నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, జిల్లా కార్యదర్శి కనపర్తి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అఖండజ్యోతి ప్రజ్వలన



**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త** కార్తికమాసం పురస్కరించుకొని బుచి ్చరెడ్డిపాళెం రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో వేడుకగా అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారిని, అఖండ జ్యోతిని దర్శించుకొని పరవశించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా దర్శి బాల నరసింహారావు, వెంకటశిరిషా దంపతులు వ్యవహారించారు. కార్యక్రమాలను ఆలయ కమీటి వారు పర్యవేక్షించారు.

# అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపించండి



**నెల్లూరు అర్బన్, నవంబర్27, ప్రభాతవార్త** సోమవారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీలు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోజుకు మూడుసార్లు అన్ని అర్జీలను వచ్చాయో లేదో చూడాలన్నారు. నిర్ధిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరించాలని, పునరావృత్తం కాకుండా ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తమకు సంబంధించిన అర్జీలను ముందుగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో నుడా విసి బాపిరెడ్డి, జడ్పి సీఈవో చిరంజీవి, డిపిఓ సుస్మిత, హౌసింగ్ మెప్మాపీడీఉలు నాగరాజు, రవీంద్ర, బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనార్టీల వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, పరిమళ, నిర్మలాదేవి జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మోసపోవద్దు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 27, ప్రభాతవార్త** నగరంలోని పోలీసు మైదానంలో ఉన్న ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించిన ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి. ఈ స్పందన కార్యక్రమంలో 85 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తామని, నకిలీ నియామక పత్రాలను అందజేసి, ఆన్‌లైన్‌లోనే శిక్షణ ఇస్తున్నట్లు నమ్మించి, లక్షలు వసూళ్ల చేసే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, ప్రేమపేరుతో వివాహం చేసుకుంటామని నమ్మించి మోసం చేసే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు తిరిగి నగదు చెల్లించకుండా ఉన్న ఫిర్యాదులలో మానవత దృక్పథంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చీటింగ్, దొంగతనం, చోరీ కేసులలో ప్రత్యేక బృందాలతో చోరీ సొత్తు రికవరిపై చొరువ తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ, ఎండోమెంట్, ఆర్‌అండ్‌బి తదితర శాఖలతో ముడిపడిన వివాదాలలో సంబంధిత అధికారుల సమన్వయంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలి. బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వివిధ కారణాల వల్ల విడిపోయిన కుటుంబాలను కౌన్సెలింగ్ ద్వారా చక్క దిద్దాలని, తద్వారా వారికి భద్రత భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. స్పందన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేలా ఆదేశాలు జారీచేశారు. స్పందనలో ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసం, ఉద్యోగాల పేరిట మోసం, కుటుంబ కలహాలు, వృద్ధ తల్లిదండ్రులు వేదింపులు, భర్త/అత్తారింటి వేదింపులు, దొంగతనం, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, అనధికార చీటీలు, ఉద్యోగాలు నమోదైన కేసులలో పురోగతి, ఇతర వివాదాలు, సమస్యల ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) హిమవతి, క్రైమ్ ప్రసాద్, డీటీసీ డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ, ఎస్‌బీ సీఐ రామకృష్ణారెడ్డి, వెల్ఫేర్ ఆర్‌ఐ, కంప్లైంట్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**నెల్లూరు అర్బన్, నవంబర్27, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ఆడుదాం ఆంధ్ర క్రీడల నోడల్ అధికారి కూర్మనాథ్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సింహలతో కలిసి ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుండి క్రీడలను ప్రోత్సహించేలా డిశంబర్ 15వ తేదీ నుండి 2024, ఫిబ్రవరి 3వ తేదీ వరకుఎంపిక చేసిన క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, క్రీడా అంశాలతో పాటు పోటీలేని క్రీడలు యోగ, టెన్నికాయిట్, మారథాన్‌క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో క్రీడాపోటీలను నిర్వహిస్తోందని, అందులో భాగంగా పురుషులు, మహిళల కోసం 5విభాగాల్లో వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. 15సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే ఈ క్రీడల్లో పాల్గొనుటకు అర్హులన్నారు. జిల్లాలోని 768గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 23,070 మ్యాచ్‌లు, మండలస్థాయిలో 39మండలాల్లో 730మ్యాచ్‌లు, 8నియోజకవర్గాల స్థాయిలో320మ్యాచ్‌లు, జిల్లా స్థాయిలో 70మ్యాచ్‌లు, మొత్తం కలిపి 24,190 మ్యాచ్‌లు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గ్రామస్థాయిలో గెలుపొందిన జట్టు మండలస్థాయికి, మండలస్థాయిలో గెలుపొందినజట్లు నియోజకవర్గ స్థాయికి, నియోజకవర్గంలో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు రాష్ట్ర స్థాయికి ఎంపిక అవుతారని జాయింట్ కలెక్టర్ వివరించారు. ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీలు, పతకాలు అందజేయడం జరుగుతుందని, నియోజకవర్గ, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ పోటీల నిర్వహణకు 56క్రీడాంశాలలో కావాల్సిన అన్ని క్రీడా సామాగ్రిని ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్వహణకు కావాల్సిన మైదానాలు, స్టేడియాలు సంసిద్ధం చేయడం జరిగిందని, జిల్లాలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనే ఔత్సాహికులు ఈ రోజు నుండి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆడుదాం ఆంధ్ర.ఏపి.జివోవి.ఇన్ ద్వారా ఆన్‌లైన్లో కానీ, 1902నెంబర్‌కు కాల్ చేసి లేదా, గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా గాని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ టి.బాపిరెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ బి.చిరంజీవి, సెట్నెల్ సీఈఓ నాగరాజకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, టిపిఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మనుబోలు లో భారీ వర్షం



**మనుబోల, నవంబర్ 27, ప్రభాతవార్త :** మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుండి మండలంలో ఆకాశం మేఘవృత్తమై చినుకులతో ప్రారంభం అయిన వర్షం కాస్తా భారీ వర్షం గా మారింది. ఈ వర్షాలు మరో రెండు, మూడు రోజులు కురుస్తాయనీ వాతావరణ శాఖ సూచనతో మండలంలో రైతాంగం రబీ సాగు సేద్యానికి ఊతం ఇస్తాయనీ భావిస్తున్నారు. బండేపల్లి బ్రాంచ్ కాలువ ఆయుకట్టు క్రింద భారీ వర్షాలు కురిస్తే నారుమళ్ళు పోసుకుంటారు. అలాగే చెరువుల్లో కి నీరు వస్తుందనీ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండంలంలో 24.0 మిమి ల వర్షపాతం నమోదు అయ్యింది .

## విద్యుత్‌భవన్‌ని ముట్టడించిన గిరిజన సంఘాలు



**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** మనుబోలు మండలం, వీరంపల్లి సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న భానుచందర్‌ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం నగరంలోని కరంటు ఆఫీసుసెంటర్లో ఉన్న విద్యుత్‌భవన్ కార్యాలయాన్ని గిరిజన సంఘాల నాయకులు, వారికి మద్ధతు తెలుపుతూ జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సర్వేపల్లి నాయకులు కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా దర్గామిట్టలో ఉన్న ఆశాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు కార్యాలయాన్ని చుట్టుముట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సిగ్గో సిగ్గో గిరిజనుల పొట్టకొట్టడం, డౌన్ డౌన్ వైసీపీ, డౌన్ డౌన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఈ తక్షణమే బయటకు తమకు సమాధానం చెప్పి, నాయ్యం చేయాలంటూ అక్కడ నినాదాలతో హోరెత్తించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. గిరిజన నాయకులు పోలీసుల మధ్య తీవ్ర వాగ్వివాదం చేటుచేసుకుంది. రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌లు మాట్లాడుతూ చిట్టేటి భానుచందర్ గత 9ఏళ్ళుగా సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడన్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి కారణం చూపకుండానే ఆయన్ని విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. దీనిపై గత రెండువారాలుగా ఎస్‌ఈని కలిసి అతన్ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఎస్‌ఈ రెండురోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటి వరకు భానుచందర్‌కి ఎలాంటి న్యాయం చెయ్యకపోగా ఆయన ఎక్కడ ఉన్నాడో అర్థం కావడం లేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోందని మండిపడ్డాడు. అరాచకాలకు పాల్పడుతున్నవారికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 36వేల మంది యానాదులు ఉన్నారని దానిని దృష్టిలో ఉంచుకోవాలని హెచ్చరించారు. మా ఓట్లతో గెలిచి, మా బిడ్డల ఉద్యోగాలను తొలగిస్తారని ఆయన ప్రశ్నించాడు. రానున్న ఎన్నికల్లో ఇంటింటికి తిరిగి నిన్ను చిత్తుగా ఓడిస్తామని పెంచలయ్య హెచ్చరించాడు. గతంలో శ్రీకాంత్ జూనియర్ లైన్‌మ్యాన్‌ని ఆ ఊరికి చెందిన వైసీపీ నేత సురేంద్రరెడ్డి పెట్టే వేధింపులకి తట్టుకోలేక సెలవు పెట్టి వెళ్ళిపోయాడని గుర్తుచేశాడు. సురేంద్రరెడ్డి అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళ కొడుకుకి ఉద్యోగం ఇచ్చేందుకు భానుచందర్‌ని బలి చేస్తారని ధ్వజమెత్తాడు. ఇదేనా న్యాయమాని, భానుకి న్యాయం చేయకపోతే నిన్ను చిత్తుగా ఒడిస్తామని ఆయన హెచ్చరించాడు. విద్యుత్‌భవన్‌ని నాలుగుగంటల ముట్టడి అనంతరం ఎస్‌ఈ వారి వద్దకు వచ్చి, ముగ్గురు డీఈల సమక్షంలో భానుచందర్‌ని ఎందుకు తొలగించారనే దానిపై విచారించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ముట్టడిని విరమించుకున్నారు.

## నాడు-నేడు పనుల్లో పారదర్శకత ముఖ్యం



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 157 అంగన్‌వాడీ భవనాలకు నాడు-నేడు 2వ దశ కింద మరమ్మతులు చేసేందుకు నిధులు కూడా సిద్ధంగ ఉన్నాయని, చేపట్టే పనుల్లో పారదర్శకత అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలలకు సంబంధించిన పనులు మంజూరైన అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు రెండవ దశలో కోవూరు ప్రాజెక్టులో మంజూరైన అంగన్‌వాడీ భవనం సంబంధించి చేపట్టే మరమ్మతులు కేంద్రానికి పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా ఉండాలన్నారు. ముఖ్యంగా ఈ పనులకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. ముఖ్యంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి మదర్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా వీటికి సంబంధించి బ్యాంక్ ఖాతాలు కూడా వెంటనే ఓపెన్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హక్కులతో పాటు వారికి కేటాయించిన విధులు , బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడే ఉపయోగగంగా ఉంటుందన్నారు. జిల్లాలోనే ఈ పనుల విషయంలో కోవూరు ప్రాజెక్టు ముందుడాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి, ఏసీడీపీవో అరుణ, సూపర్‌వైజర్లు వి. శకుంతల, ఏ. రాధిక, ప్రమీల, పద్మ, ప్రసన్న, సుమిత్ర, నిర్మల, నాగభూషణమ్మ, ఉమా, రమణిలు ఉన్నారు.

**- చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు**

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు 2 కింద మంజూరైన పనులు విషయంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నాడు-నేడు అధికారులు మూర్తి, నేతాజీలు తెలిపారు. ఈ మేరకు సోమవారం సమావేశంలో పాల్గొన్న 157 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పనులు ఏ విధంగా చేపట్టాలి , రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా చేయాలి అనే విషయాలపై అవగాహన చేపట్టారు. ఇసుక, సిమెంట్ సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త మొబైల్ అప్లికేషన్లఓ పనులకు సంబంధించిన పూర్తి వివరాలను అప్‌లోడ్ చేసుకుని ఎప్పటికప్పుడు పనులు పారదర్శకంగా చేపట్టాలన్నారు.

## ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్లు ప్రారంభం



**తోటపల్లిగూడూరు, నవంబర్ 27, ప్రభాతవార్త :** క్రీడా రంగంలో యువతను సమున్నత రీతిలో ప్రోత్సహించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడలు గ్రామ స్థాయి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దడం, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా యువత కోసం ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం, రాష్ట్రంలో 50 రోజుల పాటు క్రీడా సంబరాలు, ఈ క్రీడల కోసం ఈనెల 27నుంచే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయని ఎంపీడీఓ తెలియజేశారు.

## ఉపాధ్యాయ రాష్ట్రష కార్యదర్శిగా రాము



**విడవలూరు, నవంబర్27, ప్రభాతవార్త :** విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలలో రాష్ట్ర కార్యదర్శి గా నెల్లూరు జిల్లా విడవలూరు మండలం ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు రాము ఎన్నికైయ్యారు. వారి ఎన్నిక పట్ల విడవలూరు మండలం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కృష్ణ, శ్రీనివాసులు, సతీష్, విజయభాస్కర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల ముందంజలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## సాగులో ఉన్న భూములను పంపిణీ చేయవద్దు



**వరికుంటపాడు, నవంబర్ 25, ప్రభాతవార్త :** గత పదిహేను సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు గతంలోనే పట్టాలు, పాసుబుక్ లు ఉన్న వాటికి ఇప్పుడు భూ పంపిణీ లో పట్టాలు ఇచ్చేందుకు ప్రయాత్నాలు చేస్తున్నారనీ కాబట్టి ఆ భూములను పంచవద్దంటూ మండలంలోని కొండాయపాళెం గ్రామస్థులు సోమవారం తహశీల్ధార్ నేలపాటి మల్లికార్జున కు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గతం లో భూ పంపణీ 1,2,3,4,5,6 విడతల్లో తమకు సుమారు 50 ఎకరాలు భూమిని వివిధ వర్గాల వారికి పంపిణీ చేసి, పట్టాలు, పాసుబుక్ లు ఇచ్చారనీ, అప్పటి నుండి తాము ఆ భూముల్లో పంటలు పండించుకుంటున్నామనీ, ప్రస్తుతం కూడా ఆ భూముల్లో తామే అనుభవంలో ఉన్నామనీ కానీ కొంతమంది తమ భూములకు తిరిగి భూ పంపిణీ చేసేలా చూస్తు తమకు అన్యాయం చేస్తున్నారనీ, కాబట్టి తహశీల్ధార్ ఆ భూములను పరిశీలించి తమకు న్యాయం చేయాలనీ గ్రామస్తులు కోరుతున్నారు.

## గిరిజన యువత నేరాలకు పాల్పడుతున్నారు...ఉపాధి కల్పించండి



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త :** గిరిజన యువత నేరాలకు పాల్పడుతున్నారని వారికి ఉపాధి కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ సమితి ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మల్లి మాట్లాడారు. బోగోలు మండలంలోని తిప్ప దగ్గర గురుకుల పాఠశాలకు ఎదురుగా 6 కోట్ల రూపాయలతో నిర్మించిన గిరిజన ఉపాధి శిక్షణ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆరు కోట్ల రూపాయల వ్యయంతో శిక్షణా కేంద్రాన్ని నిర్మించారన్నారు. ఇక్కడ ఉపాధి కోసం గిరిజన, దళిత యువతీ యువకులకు వివిధ రకాలలో శిక్షణ ఇచ్చి నెలకు 5 వేల రూపాయలు ప్రతి ఒక్కరికి స్టైఫండ్ ఇచ్చేవారన్నారు. మోటార్ వైండింగ్, హౌస్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరు, బ్యూటీ పార్లర్, కుట్టు శిక్షణ కేంద్రం, డిజైన్ టెక్నాలజీ, ఆటో, స్కూటర్ రిపేర్లపై స్వయం ఉపాధి కొరకు శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత రెండు లక్షల రూపాయలు బ్యాంక్ రుణాలకు సిఫారసు చేసి ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా అందజేసేవారన్నారు. వైసిపి పాలనలో ఈ ఆరు కోట్ల రూపాయల బిల్డింగ్‌ను నిర్వీర్యం చేశారన్నారు. ఈ శిక్షణా కేంద్రాన్ని తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిందని వదిలివేయడం అన్యాయమన్నారు. దీంతో గిరిజన, దళిత యువత అనేక నేరాల వైపు దృష్టి సారించి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ శిక్షణ కొనసాగించి వుంటే గిరిజన యువతీ యువకులు అనేక ప్రయోజనలు పొందే వారన్నారు. ఇప్పుడు వారి జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఉపాధి వైపు దృష్టి పెట్టకుండా యువతీ యువకుల జీవితాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని అబద్దాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ శిక్షణా కేంద్రంలో కావలి డివిజన్‌లోని అన్ని మండలాలలో వున్న దళిత, గిరిజనులకు శిక్షణ ఇవ్వాలన్నారు. తద్వారా వారి జీవితాలను చక్కదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, లక్ష్మినర్సు, జెడ్డా వాసు, యం.మోహన్‌రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష తులసీ పూజ



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త :** కావలి పట్టణం కచ్చేరిమిట్ట బాలాజీనగర్‌లో వేంచేసి వున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు సామూహికంగా లక్ష తులసీ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, ఆలయ కమిటీ బాధ్యులు తిరివీధి ప్రసాద్, తిరివీధి బ్రహ్మయ్య, కాంతారావు, హనుమకుమార్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

## ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో కమిషనర్



**నెల్లూరుకార్పొరేషన్, నవంబర్27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగరపాలక సంస్థ పరిధిలో కమిషనర్ వికాస్‌మర్మత్, ఐఏయస్ సోమవారం ప్రారంభించారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు సమీపంలోఁ సచివాలయంలో 50/3, 49/1, 49/2, 48/1, 48/2, 48/3, 42/1 సచివాలయాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కమిషనర్ పర్యవేక్షించారు. టోర్నమెంట్ రిజిస్ట్రేషన్ అక్నాలెడ్జ్మెంట్ పత్రాలను క్రీడాకారులకు కమిషనర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, టిపిఆర్ఓ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## మన్నవ శ్రీనిత్య జన్మదినానికి యాచకులకు దుప్పట్లు, బిర్యానీ పంపిణీ



**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర మనుమరాలు అమెరికాలో వుంటున్న మన్నవ శ్రీనిత్య చౌదరి 11వ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం యాచకులకు దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కావలి ఆర్టీసీ వద్ద వున్న లక్ష్మి ఫర్నిచర్స్ అండ్ హోమ్ నీడ్స్ వద్ద జరిగిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని యాచకులకు దుప్పట్లు, బిర్యానీ ప్యాకెట్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం మాలేపాటి మాట్లాడుతూ మన్నవ రవిచంద్ర, వారి కుటుంబ సభ్యులు ఏ శుభకార్యమైనా పేదవారికి సాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. అమెరికాలో వుంటున్న శ్రీనిత్య చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుకు అవార్డ్



**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త :** భారతదేశంలో రొయ్యల పరిశ్రమను ప్రోత్సహించడంలో గణనీయమైన ప్రభావితం చేసినందుకు, విశేషమైన సహకారాలు అందించడమే గాక అసమానమైన నైపుణ్యానికి గుర్తింపుగా రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్(రొయ్యలు)తో సత్కరించడం జరిగింది. నవీ ముంబైలోని వాషిలోని సిడ్కో కన్వెన్షన్ సెంటర్‌లో ష్రిమ్ప్ రిటైల్ సంస్థ ఈ అవార్డును బీద మస్తాన్‌రావు కుమార్తె, బియంఆర్ గ్రూప్ డైరెక్టర్ బీద మాధురికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటి వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అందించారు.

## వైభవంగా అయ్యప్పస్వామి లక్షబిల్వార్చన



**విడవలూరు, నవంబర్27, ప్రభాతవార్త :** మండలంలోని సొకచెర్ల పంచాయతీ తుమ్మగుంట గ్రామంలో రెండో శబరిమలైగా పేరు గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయ్యప్ప ఆలయంలో సోమవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా లక్షబిల్లార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి మహాన్యసగాపూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, పూజ, అర్చనలు, పరిమళపుష్పాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అయ్యప్ప స్వామి భక్తులు భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం జ్యోతిని వెలిగించి స్వాములు, భక్తులు తిలకించిపోయారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. విచ్చేసిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, శశిరెడ్డి, ఓగు నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు అన్నం రామచంద్రయ్య, దర్శగుంట జ్యోతి, పంచమూర్తి సుమలత, బూదూరు చెంచమ్మ, అర్చకులు బాట్టారం చంద్రశేఖర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తాచెదారాలకు, పందులకు నిలయాలుగా ఖాళీ స్థలాలు



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని పలు వీధులలో వున్న ఖాళీ స్థలాలు చెత్తాచెదారాలకు, పందులకు, కుక్కలకు నిలయాలుగా మారాయి. ఖాళీ స్థలాల నిర్వాహకులు వదిలివేయడంతో ఆ జాగాలు పెద్ద డస్ట్‌బిన్లుగా మారిపోతున్నాయి. దోమల ఉధృతికి కేంద్రాలయ్యాయి. పట్టణంలోని ప్రతి వీధిలో ఐదారు పైచిలుకు ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. కొన్ని ఖాళీ స్థలాలు రాత్రి వేళలలో అసాంఘిక కార్యకలాపాలకు వేదికలుగా మారాయి. స్థలాలు కొనుగోలు చేసి ఖాళీగా పెట్టిన యజమానులను కమిషనర్ కార్యాలయానికి పిలిపించి మందలించాల్సిన అవసరం ఎంతైనా వుంది. సకాలంలో ఆ జాగాకు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించి చెత్తాచెదారాలు వేయకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది. అవసరమైతే భారీ స్థాయిలో ఫెనాల్టీలు వేసి ఆ యాజమానులకు కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం కూడా వుంది. కావలి పట్టణ ప్రధాన కూడళ్ళలో ఖాళీ జాగాలలో చెత్తాచెదారాలతో కుళ్లిపోయి దుర్గంధభూయిష్టంగా మారి ప్రజల రాకపోకలకు అవాంతరాలుగా నిలుస్తున్నాయి. కావలికి కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ ఖాళీ జాగాల చెత్తాచెదారాలపై దృష్టి సారించి కావలి పట్టణాన్ని పరిశుభ్రత నిలయంగా తీర్చిదిద్దాలని కావలి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## సిమెంటును బొక్కేశారు...!



**విడవలూరు, నవంబర్27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధిలో భాగంగా గ్రామాల్లో ప్రజల వద్దకే పాలన అందించేందుకు నిర్మిస్తున్న అభివృద్ధిలో భాగంగా సచివాలయాల నిర్మాణాలను చేపట్టింది. ఈ నిర్మాణాలలో భవనాలు నిర్మాణంకు స్థలాల నుండి నిర్మాణాలకు వాడే సిమెంట్ కాజేయడం వరకు అక్రమాలు శృతిమించుతున్నాయి. ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులు ద్వారా మండలంలోని చౌకచర్ల గ్రామంలో సచివాలయ నిర్మాణంకు 40లక్షల నిధులు కేటాయించారు. అయితే ఆ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం ఓ దాత ఇచ్చిన స్థలంలో సచివాలయం నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేసి తూతూ మంత్రంగా గుణంతాలు తీసి పనులు ప్రారంభించారు. ఎనర్జీఎస్ ఉపాధి హామీ పనుల కింద 30వేలు బిల్లు మంజూరు చేసి అనంతరం నిర్మాణానికి 500బస్తాల సిమెంటును మింగేసినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. 500 బస్తాల విలువ సుమారు 15లక్షల మేర ఉండగా సచివాలయ భవన నిర్మాణం ఆగిపోవడం స్థలం లేకపోవడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఈ గ్రామంలో దీనితోపాటు 17లక్షల విలువ కలిగిన బిల్స్ మిల్క్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. సచివాలయ నిర్మాణం ఆగిపోవడంతో ఈ బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణానికి ఈ వచ్చిన సిమెంట్ బస్తాలను ఎన్‌ఆర్‌జెఎస్‌లో వాడిన నగదును ఉపయోగించినట్లు అధికారులు చెప్పడం గమన్వారం. బల్క్‌మిల్క్ సెంటర్ 17లక్షల రూపాయలతో నిధులు మంజూరు అయితే ఈ సిమెంటును ఆ భవనానికి ఎలా వాడారు అనే విమర్శలు కూడా వెలువడుతున్నాయి. ఈ రెండు భవనాల పురోగతి, నాణ్యత కేటాయించిన నిధులు లెక్కలను ఉన్నతాధికారులు విచారణ చేపట్టి పరిశీలించాలని ప్రజలు కోరుకుంటున్నారు. సచివాలయ నిర్మాణం ఆగిపోవడం వాస్తవమే. ఈ విషయంపై పంచాయతీరాజ్‌శాఖ ఏఈ శ్రీనివాసులును ప్రభాతవార్త వివరణ కోరగా గ్రామంలో సచివాలయ నిర్మాణం నిలపోయింది వాస్తవమే, కేటాయించిన స్థలం వివాదంలో ఉండడంతో భవన నిర్మాణం నిలిచిపోయిది. మొదట్లో నిర్మాణం చేపట్టాం, నిర్మాణం ప్రారంభం దశలో 500బస్తాలు సిమెంట్ వచ్చింది, వీటిని అదే గ్రామంలో నిర్మాణం చేపడుతున్న బల్క్‌మిల్క్ సెంటర్‌కి ఉపయోగించడం జరిగిందన్నారు.

## వైభవంగా కార్తీక సోమవారం పూజలు







## గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** : జిల్లాలో గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం జిల్లా కోఆర్డినేటర్ బీద లక్ష్మినంద పేర్కొన్నారు. బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీలో సర్వేయర్‌గా పనిచేస్తున్న బీద లక్ష్మినందను విజయవాడ ఎపి ఎన్జీవో హోం రాష్ట్ర గ్రామ సర్వేయర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బూరాడ మధుబాబు ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లక్ష్మినంద మండలంలోని తాళ్ళూరు గ్రామానికి చెందిన రక్తదాన చైతన్యకర్త, స్వచ్ఛంద రక్తదాత, లైవ్ బ్లడ్ వరల్డ్ సంస్థలో పనిచేస్తున్నారు. తనను ఎన్నుకున్నందుకు సర్వేయర్ల సంఘం రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సర్వేయర్ల సమస్యలకు అందుబాటులో వుంటానని తెలిపారు.

## మణికంఠనగర్‌లో వైభవంగా రుద్రాభిషేకం

**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** : బోగోలు మేజర్ పంచాయతీలోని మణికంఠనగర్‌లో సోమవారం అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి,వినాయక దేవస్థానంలో సోమవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మాన్యాస రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా చేపట్టారు.

## రామస్వామిపాలెంలో కార్తీక పౌర్ణమి వేడుకలు



**బిట్రగుంట, నవంబరు 27 ప్రభాతవార్త** : బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని రామస్వామిపాళెంలో శ్రీ విఘ్నేశ్వర రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు ఉపవాస దీక్షతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

## నిరుపేద స్వర్ణకారుడికి లక్షా 5 వేల రూపాయలు ఆర్థిక సాయం



**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త** : కావలి పట్టణానికి చెందిన నిరుపేద స్వర్ణకారుడు మహేష్ ఆచారి ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీంతో కావలి స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు పుత్తూరు నాగాచారి ఆధ్వర్యంలో సోమవారం మహేష్ ఆచారి కుటుంబ సభ్యులకు లక్షా 5 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నాగాచారి మాట్లాడుతూ అనారోగ్యంతో మృతి చెందిన మహేష్ ఆచారి కుటుంబానికి కావలి స్వర్ణకారులు ఎల్లవేళలా అండగా వుండి సహాయ సహకారాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. స్వర్ణకారులకు ఎటువంటి కష్టం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ఆచారి, కోశాధికారి జరీఫ్, సహాయ కార్యదర్శి మునికుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేనిని దూషించడం దారుణం

**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త** : ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురం మండల వైసిపి నాయకులు చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉదయగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ బొల్లినేని వెంకట రామారావుని ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా దూషించడం దారుణమని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు తెలిపారు. బొల్లినేని వెంకట రామారావు విలువలు కలిగిన రాజకీయ నాయకుడని తెలిపారు. ఆయన ఎవరిని ఇబ్బంది పెట్టడం కానీ కక్ష సాధింపు చర్యలు చేసేవారు కాదని తెలిపారు. ఆలాంటి వ్యక్తిని దూషించడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. చింతంరెడ్డి సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ రిపోర్టు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై బొల్లినేని తరపున న్యాయ పోరాటం చేసేందుకు కూడా సిద్దంగా వున్నానని తెలిపారు.

## అభివృద్ధి,సంక్షేమమే జగనన్న లక్ష్యం



**జలదంకి,నవంబర్ 27,ప్రభాతవార్త** : ఇచ్చిన హామిలకు కట్టుబడి,నవరత్నాలను పక్కాగా అమలు చేసిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారనీ ఉదయగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.జలదంకి మండలం చోడవరంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమము చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి తిరిగి జగనన్న చేసిన మేలును గూర్చి వివరించారు.తన సంకల్పంతో సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్న ఘనత ఆయనది అన్నారు.ప్రతి పక్షాలు ఎన్ని అవంతరాలు సృషిస్తున్న మొక్కవోని ముందుచూపుతో అనుకున్నది చేస్తున్నారనీ తెలిపారు.రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత ముందుకు దూసుకుపోవాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిందేనని స్పష్టం చేశారు.ఇటువంటి అభివృద్ధి ప్రధాతకు రాబోయో ఎన్నికల్లో మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో నెలకొన్న కొన్ని సమస్యలను రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు.వీటిపై సంబందిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలనీ ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమములో పంచాయతి వైకాపా నేత వల్లంరెడ్డి నర్సారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.మండల పార్టీ అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి,జిల్లా ప్రచారకార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి ,మండలసచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ,సొసైటి అధ్యక్షుడు రవిరెడ్డి,నేతలు రావి ప్రసాద్‌నాయుడు,సతీష్‌బాబు,గుర్రం జగ్గయ్య, దేవరపల్లి మధుసూధన్‌రెడ్డి,వట్టికాల బాలయ్య,కుమ్మిడి రమేష్,ఆరోన్ తహశీల్ధార్ రమణారావు,ఎంపిడిఓ,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో భేటీ అయిన మనుక్రాంత్‌రెడ్డి



**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** : జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నగరం, రూరల్‌లో చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. పలు రాజకీయ అంశాలపై వారి మధ్య చర్చలు జరిగాయి, గతం, ప్రస్తుతం నగరం, రూరల్ నియోజకవర్గాల రాజకీయ అంశాలపై కూలంకషంగా మాట్లాడుకున్నారు. ఈ భేటీలో జనసేన నాయకుడు సుందరరామిరెడ్డి, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సర్పంచ్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పావని




**తోటపల్లిగూడూరు, నవంబర్ 27, ప్రభాతవార్త** : మండలంలోని విలుకానిపల్లి గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పావనిని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సోమవారం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి, నాగేంద్ర, ప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కే.శ్రీనివాసన్, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కందమూడి శివకుమార్, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచ్ సంఘం ఉపాధ్యక్షులు చిట్టెటి కవిత, ఛాంబర్ నాయకులు గోపిరెడ్డి వెంకటేష్ యాదవ్, మునీష్, సర్పంచ్‌ల సంఘం, ఛాంబర్ నాయకులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త** : కోవూరు మండలంలో డిసెంబర్ 15వ తేది నుంచి 2024 ఫిబ్రవరి 3వ తేది వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీహరి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకే చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో ఈ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొనే యువత 15 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే అర్హులన్నారు. డిసెంబర్ 3వ తేది వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి గ్రామ సచివాలయ స్థాయిలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## విద్యావ్యవస్థ అస్తవ్యస్థం





**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** : జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యావ్యవస్థ అస్తవ్యస్థం అయిపోయిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ మండిపడ్డారు. సోమవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు షేక్ అమృల్లాల ఆధ్వర్యంలో విద్యార్థి మేలుకో-భవిష్యత్తు మార్చుకో పోస్టర్లను అజీజ్ ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా అబ్దుల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 82లక్షలమంది విద్యార్థులు అమ్మఒడి పథకానికి అర్హులుగా ఉంటే 40లక్షలమందికి కూడా సాయం దక్కని పరిస్థితన్నారు. 4ఏళ్ళలో 4709 ప్రభుత్వ పాఠశాలల రద్దు, 50వేల టీచర్ల పోస్టుల భర్తీ గాలికి వదిలేశాడని జగన్‌పై మండిపడ్డాడు. పీజీ విద్య నభ్యసించే విద్యార్థులకు టీడీపీ గత ప్రభుత్వాలు ఫీజు రీఎంబర్స్‌మెంటు అందించగా అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ కోర్సు మధ్యలోనే రద్దు చేసిందని ఆయన ఆరోపించాడు. జగన్ తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పీజీ విద్యార్థులు రోడ్డునపడ్డారన్నారు. విద్యార్థులు, యువతకు ఉపాధి అవకాశాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. లులూ, అదాని డేటా సెంటర్, ఫ్రాంక్లిన్ టెంపుల్డన్, అమర్‌రాజా, పేపర్ పరిశ్రమ లాంటి ఎన్నో వందల కంపెనీలు మన రాష్ట్రాన్ని నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని విమర్శించాడు. పేద విద్యార్థులకు ఉన్నతమైన, నాణ్యమైన విద్య, విదేశీ విద్య అందించాలని టీడీపీ ప్రవేశపెట్టిన వాటిని తుంగలో తొక్కాడన్నారు. సంక్షేమ హాస్టల్‌లలో మెస్, కాస్మోటిక్ చార్జీలను, నిత్యావసర వస్తువులకు అనుగుణంగా చార్జీలను పెంచకుండా హాస్టల్ విద్యార్థుల పొట్టకొడుతున్నాడని ఆయన ఆవేదన వ్యక్తంచేశాడు. యువతకు స్కిల్‌డెవలప్‌మెంటు శిక్షణ అభివృద్ధి కోసం సెంటర్లను ఏర్పాటు చేస్తే టీడీపీపై బురదచల్లుతోందని ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు. విద్యారంగానికి వైసీపీ ప్రభుత్వం చేసిన ద్రోహం పట్ల విద్యార్థులను చైతన్య పరచాల్సిన బాధ్యత, విద్యార్థుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి కోసం టీడీపీ చేసిన మేలు వివరించే బాధ్యత టీఎన్ఎస్ఎఫ్ఐ ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి నవీన్, హేమంత్, కమల్, వెంకటాద్రి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన 200కుటుంబాలు



**నెల్లూరు నవంబర్ 27, ప్రభాతవార్త-వైద్యం** : రూరల్ నియోజకవర్గం పరిధిలో 29వ డివిజను ఆటోనగర్‌కు చెందిన స్థానిక 200వందల కుటుంబాలు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. వారందరినీ శ్రీధర్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు అండగా పార్టీలో చేరుతున్న ప్రతిఒక్కరి రుణం తీర్చుకుంటానన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా చంద్రబాబుని సీఎంని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కనపర్తి గంగాధర్, అస్లాం, లక్ష్మిరెడ్డి, మమతారెడ్డి, జిలాని, దేవి, జహీర్, ఖాదర్‌బాషా, అబ్దుల్‌ఖాదర్, శివ, శశి, శ్రీనివాసులు, విజయమ్మ, కళమ్మ, సుధా, ఆదిలక్ష్మి, హేమలత, బి మల్లి, కత్తి హరి, వెంకీ, సిద్ధు, విక్రమ్, జరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు కోసం ధరఖాస్తులు స్వీకరించండి



**సీతారామపురం నవంబర్ 27 ప్రభాతవార్త** :మండలంలోని సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని తహసిల్దారు ఎంవి.కె సుధాకర్‌రావు సూచించారు.సోమవారం మండలంలోని సీతారామపురం బిట్-1 సచివాలయంలో తనిఖీ చేసి హాజర్‌మూమెంట్ ,రిజిష్టర్ సిబ్బంది యొక్క విధి నిర్వహణ రిజిష్టర్లను పరిశీలించారు.ప్రతి ఒక్క సచివాలయం సిబ్బంది పనివేళలో సచివాలయంలో అందుబాటులో ఉండాలని బయెమెట్రిక్ ,హాజర్,ఖచ్చితంగా వేయాలని సాయింత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు అందరు అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. అనంతరం బిఎల్‌ఒలతో సమావేశమై ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన నేపద్యంలో అందులో ఏమైనా ఓటర్ల మార్పులు చేర్పులు ,నూతన ఓటు హక్కు కోసం ధరఖాస్తులను స్వీకరణ కొరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బిఎల్‌ఒలు వారి పరిధిలోని గ్రామాలలో ఉండి ధరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. అదే విధంగా నూతనంగా ఓటు హక్కు కోసం ధరఖాస్తు చేసుకునే వారు ధరఖాస్తు ఫారాలను బిఎల్‌ఒల వద్ద ఇవ్వాలని లేదా ఆన్‌లైన్‌లో గాని ధరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు.ఈకార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, సచివాలయ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి,రెవిన్యూ పంచాయితీ కార్యదర్శులు బిఎల్‌ఒలు పాల్గోన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జాపై ఆర్డిఓకు వినతిపత్రం



**ఆత్మకూరు, నవంబర్27, ప్రభాతవార్త** : ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో వాగు పోరంబోకు , తిప్ప పోరంబోకు ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు బహిరంగంగా కబ్జాచేసి లక్షలాది రూపాయలకు అమ్ముకొని ప్రభుత్వ భూములనున స్వాహా చేస్తుండగా కబ్బాదారుల నుండి మామూళ్ళు వస్తుండడంతో కబ్జాదారులకు పూర్తి సహకారం అందిస్తున్న అధికారులు, రాజకీయ నాయకుల అండదండలలతో అధికారులను లోబరచుకొని ఆత్మకూరు మునిఇ్సపాల్టీ పరిధిలో ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. కబ్జాదారులు ఎంతకు తెగించారంటే ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల ఎదుటట ఆర్అండ్ బి స్థలాన్ని కూడా రాత్రికి రాత్రి చదును చేసి భవనాలను నిర్మించేందుకు సిద్ధమయ్యారు. నిత్యం వేలాదిమంది తిరుగుతూ ఉండే ఈప్రాంతంలో బహిరంగంగా స్థలాన్ని కబ్జా చేస్తున్న విషయాన్నిస్థానికులు అధికారులకు సమాచారం తెలిపినా కూడా పట్టించుకొనకపోవడంతో సోమవారం ఆత్మకూరు పట్టణ సిపిఎం నాయకులు రాత్రికి రాత్రి కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆర్డిఒకు వినతిపత్రం అందజేశారు. .దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డిఒ తెలిపారు .ఈకార్యక్రమంలో మున్సిపాల్టీ మాజీ వైస్ చైర్మెన్ సందాని, సిపిఎం పటట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, ఐద్వా మహిళాసంఘ నాయకులు గుల్జార్‌బేగం , సిపిఎం నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో అధికారులే కబ్జాదారులకు సహకరిస్తూ విలువైన ప్రభుత్వ స్థలాలను అమ్ముకుంటూ సంపాదిస్తున్నారని రాజకీయ నాయకుల అండదండలతో అధికారుల సహకారంతో కబ్జాదారులు ఇస్టానుసారంగా స్థలాలు కబ్జాచేస్తూ లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ పబ్బం గడుపుకుం టున్నారన్నారు. కళ్ళముందు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ ఇస్టానుసారంగా భవనాలు నిర్మిం చుకుంటున్నా అధికారులు పట్టించుకొనకపోవడం బాధాకరమన్నారు. దీనిపై తగు చర్యలు లేకపోతే తమ పార్టీ పూర్తిస్థాయిలో ఉద్యమాన్ని చేపడతామన్నారు.

## నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం



**నెల్లూరు అర్బన్, నవంబర్27, ప్రభాతవార్త** : సోమవారం నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జరుగుతున్న స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాద్‌ని కలిసిన నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్.కాలేషా నెల్లూరు జిల్లాలో అర్హులూన దివ్యాంగులకు జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఎఫ్‌డిసి) ద్వారా రుణాలను పొందేందుకు ఆగస్టు 31న ఆఖరు తేదీగా ప్రకటించి ధరఖాస్తులను స్వీకరించారు.జిల్లా వ్యాప్తంగా సుమారు 32ధరఖాస్తులు వరకు వచ్చాయని వాటిని పరిశీలించిన జిల్లా దివ్యాంగుల కార్పొరేషన్ వారు ఎన్‌హెచ్ఎఫ్‌డిసి రుణాల మంజూరు కమిటీ సభ్యులతో కలిసి 25న దివ్యాంగుల ధరఖాస్తుదారులను పిలిపించి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పరిశీలించి నెలలు గడుస్తున్నా నేటికి రుణాలు అందజేయలేదు.కార్పొరేషన్ అధికారులను అవమానపరిచే విధంగా దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను ఉల్లంఘించడం జరుగుతుంది.దివ్యాంగులు ఎంతో వ్యయప్రయాసతో తీవ్రంగా కష్టపడి ప్రభుత్వ ఉద్యోగి,డ్రాయింగ్ అఫీసర్‌లను షూరిటీగా పెట్టి 5లక్షల రూపాయల వరకు రుణం పొందుందుకు చర్యలు తీసుకుంటారని ఆశిస్తే వారి ఆశలను ఆడియాసలు చేస్తూ కావాలని కాలయాపన చేస్తూ అధికారుల తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు.కార్పొరేషన్ జిల్లా మేనేజర్,సిఆర్ అండ్ ఏంఓల మీద విచారించి శాఖపరమైన చర్యలు తీసుకుని ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిశంబర్ 3న తమరి చేతులమీదుగా ఎన్‌హెచ్ఎఫ్‌డిసి రుణాలకు ధరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు చెక్కులను పంపిణీ చేయవలసిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.రాంబాబు,జిల్లా కార్యదర్శి సయ్యద్ యస్‌దాన్‌భాషా,జబ్బార్,రాజేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపి యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం



**నెల్లూరుఅర్బన్, నవంబర్27, ప్రభాతవార్త** : సోమవారం ఏపీ యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా కమిటీ బృందం జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌డే సందర్భంగా పలు గిరిజన సమస్యలమీద కలెక్టర్‌కి నివేదికలు ఇవ్వడం జరిగింది.చొక్కా సుబ్బయ్య చేపల సొసైటీని రద్దు చేసి,గిరిజనులకు పట్టాలి,డి.కె.టి పట్టాలు ఇప్పిస్తామని చెప్పి 2009లో టిడిపి ప్రభుత్వం చంద్రశేఖరపురంలో ఏర్పాటు చేసిన సీఎం మీటింగ్‌కు రమ్మని చెప్పి,గిరిజనులకు డీకేటీ పట్టాలు ఇవ్వకుండా సొసైటీని రద్దు చేయడం జరిగింది.అప్పటినుండి పలుమార్లు అధికారుల ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది.ఆ సమస్య మీద కలెక్టర్‌కి నివేదిక ఇవ్వడం జరిగింది.ఇందుకూరుపేట మండలంలోని కొరటూరు పంచాయతీలో గల బకింగ్ హోమ్ కాలువ ప్రక్కన ప్రభుత్వ భూమి 350సెంట్లు ఎప్పటి నుండో ఆనాధీనంగా ఉన్నదని,ఆ భూమిని పక్కనే నివాసం ఏర్పాటు చేసుకుంటున్న 8గిరిజన కుటుంబాలకు ఇంటికి అరెకరా చొప్పున పంపిణీ చేయాలని కలెక్టర్‌ని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపి యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షులు బిఎల్ శేఖర్,వర్కింగ్ ప్రెసిడెంట్ చౌటూరు సీనయ్య,ఉపాధ్యక్షులు ఇండ్ల రవి,మహిళా కమిటీ నాయకురాలు చౌటూరి శ్యామల,చౌటూరి మురళి,తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు షురూ



**ఉదయగిరి, నవంబర్27, ప్రభాతవార్త** : మండలకేంద్రమైన ఉదయగిరిలోని తహశీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తహశీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు పలురకాల సమస్యలమీద అర్జీలు వచ్చాయని తెలిపారు.ముఖ్యంగా జగనన్న ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నేటి నుండి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.ఆయా సచివాలయాల పరిధిలోగానీ,ప్రభుత్వం ఇచ్చిన వెబ్‌సైట్‌లో గానీ,1902నెంబర్‌కి కాల్‌చేసి ఖోఖో,కబడ్డి,టెన్నిస్,క్రికెట్ లాంటి ఆటలకు గ్రామస్థాయి నుండి మండలస్థాయికి ఎంపిక చేసి,మండలస్థాయి నుండి జిల్లా స్థాయికి ఎంపిక చేసి విజేతలైన క్రీడాకారులకు భారీపారితోషకంతోపాటు ఉజ్వలభవిష్యత్తునిచ్చే అవకాశం కూడా ఉందని తెలిపారు.ఆసక్తి కలఅభ్యర్థులు 18సంవత్సరాలు పైబడిన వారు ఎవరైనా ధరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.ఈశ్వరమ్మ,ఎంఈవో తోట శ్రీనివాసులు,ఈ వోపిఆర్డి మల్లికార్జున,సాంఘీక సంక్షేమ అధికారిణి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలిపిన టిడిపి సర్పంచ్‌లు





**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త :** ప్రతిపక్షాల సర్పంచ్‌లు అంటే చిన్నచూపు......మూడు సంవత్సరాలుగా ఏ సమస్య చెప్పినా అధికారులు ఏదోఒకటి చెప్పి తప్పించుకుంటున్నారు...... అని ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు అద్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పురందరపురం సర్పంచ్ సోము నిర్మల,కందికట్టు పెంచలయ్య నిరసన వ్యక్తం చేశారు. రామచంద్రాపురం గురుకుల పాఠశాల సమీపంలో ప్రవేటు సెల్ టవర్ నిర్మాణం చేపడుతుంటే కనీసం పంచాయితీ తీర్మానం కూడా లేకుండా చేపడుతున్నారని ఇది ఎంత వరకు సమంజిసమని వారు ప్రశ్నించారు.గురుకుల పాఠశాల ప్రిన్సిఫల్ సైతం పాఠశాలకు సమీపంలో సెల్ టవర్ వద్దంటు వినతి పత్రం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ సర్పంచ్‌లు అంటే అధికారులు కూడా చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు.సర్వసభ్య సమావేశంలో కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.స్పందించిన ఎంపిడిఒ పెంచలశ్యామ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో అధికారులు అభివృద్ధి గురించి నివేదిక చదివి వినిపించారు. పెనుబల్లి ఎంపిటిసి చేవూరు వినయ్‌నారాయణ మ మాట్లాడుతు అగ్రికల్చర్ శాఖలో సిఫారస్ చేసిన వారికి మాత్రమే జీలగలు అందుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ శ్రీనివాసులురెడ్డి,హౌసింగ్ ఏఇ పెంచలయ్య,పంచాయితీరాజ్ స్పెషల్ ఏఇ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి,పంచాయితీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గోన్నారు.

## శివాలయాన్ని దర్శించుకున్న దేవాదాయశాఖ ఏసి



**బుచ్చి నవంబర్ 27 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ని (శివాలయాన్ని) దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సురేష్ స్వామి వారిని స్వాగతించారు.వారి గోత్రనామాలతో పూజలు చేసి వారికి తీర్ద ప్రసాదాలు అందించారు. శివాలయం యొక్క విశిష్టత గురించి ,ఇటీవల జరిగి మహాకుంబాభిషేకం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అదికారులున్నారు.

## గిరిజన కాలనీలలో అందరికి ఆధార్ కార్డు అందించడమే సంకల్పం



**జలదంకి,నవంబర్ 27,ప్రభాతవార్త :** గిరిజన కాలనీల్లోని పిల్లలు,పెద్దలకు ఆధార్ కార్డు అందించాలన్నా దృడ సంకల్పంతోనే పని చేస్తున్నామనీ రాష్ట్ర గిరిజన జాగృతి వేదిక ఉపాధ్యక్షుడు జయంపు.కనకారావు పేర్కోన్నారు.ఐటిడిఎ ఆధ్వర్యంలో జలదంకి మండలం చిన్నక్రాక గిరిజన కాలనీలో సోమవారం ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు.ఈ సందర్భంగా ముందుగా కాలనీ లో అవగాహన కల్పించారు.ఎస్టీలు ఆధార్ కార్డులు లేక ఇబ్బందులు ఎదుర్కోంటున్న వైనాన్ని గుర్తించి ఐటిడిఎ పిఓ దృష్టికి తీసుకువెళ్ళి విన్నవించామనీ కనకారావు తెలిపారు.వెంటనే స్పందించిన పిఓ ఆధార్ నమోదుకు అవసరమైన పరికరాలను సమకూర్చారనీ తెలిపారు.దీంతో జలదంకి మండలంలో దృష్టి పెట్టామనీ చెప్పారు.ఇప్పటికే మండలంలోని తిమ్మసముద్రం,వేములపాడు,గోపన్నపాళెం గ్రామాల కాలనీల్లో శిభిరాలు ఏర్పాటు చేశామని వివరించారు.ఆధార్ లేని జీవితం సమస్యల వలయం అవుతుందనీ,పెన్సన్,అమ్మవడి వంటి ప్రభుత్వ పధకాలు దరిచేరవని అన్నారు.ఒక రకంగా చెప్పాలంటే మనుషులుగా జీవించాలంటే ఆధార్ ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.కావున ప్రతి ఒక్కరు దీనిని గూర్చి తెలుసుకొవాలని కోరారు.అదే సమయంలో గిరిజన నాయకులు,యువకులు,వాలంటీర్లు,సచివాలయ సిబ్బంది గిరిజనులపై దృష్టి పెట్టి ఆధార్ నమోదు చేయించాలనీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమములో జాగృతి వేదిక సభ్యులు కొమరిగిరి వేణు,గాడి సుందర్,సిహెచ్ భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేల ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తగు చొరవ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆమె పలు విషయాలను ముచ్చటించారు. ముఖ్యంగా ఈ కేంద్రంలోని విద్యార్థులు పూర్తిస్థాయిలో నైపుణ్యం కలిగి పాటలు పాడడంలోగానీ, ఇతర విషయాల్లో గానీ ముందంజలో ఉండడం పట్ల విద్యార్థులను అభినందించి విద్యార్థులను ప్రోత్సహించిన అంగన్‌వాడీ కార్యకర్త ముత్యాలమ్మను ప్రత్యేకంగా అభినందించారు. ఇదేస్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలన్నారు. ముఖ్యంగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు వారి దృష్టికి వస్తే వెంటనే వారు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన వర్క్‌బుక్‌లను విద్యార్థులు వాడుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందజేసిన ప్రీస్కూల్ కిట్లను విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా చూడాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భవతులు, బాలింతలు రక్తహీనత తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త గృహ సందర్శన చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలోని ఆహారాన్ని గర్భవతులు, బాలింతలు తప్పక తీసుకునేలా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆమె గర్భవతులు, బాలింతల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి , ఏసీడీపీవో అరుణ, సూపర్‌వైజర్ అరుణ, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కోటి వత్తుల దీపాలతో పూజలు



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కార్తీక సోమవారం పర్వదినం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజా చార్యుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు కోటి వత్తులతో దీపారాధన కార్యమాన్ని సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వైభవంగా కార్తీక సోమవారం పూజలు



**కోవూరు, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీకమాసంలో వచ్చే కార్తీక పౌర్ణమి సోమవారం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా 11 వేల నర్మద బాల లింగాలకు సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను భక్తిశ్రద్ధలతో వెలగించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు మోహన్, హనుమారెడ్డి, రుత్వికులు శేఖర్‌స్వామి, సుబ్బయ్య స్వామి, మురళీస్వామి, వంశీ స్వామి, సుబ్బరావు స్వామి, తదితరులు ఉన్నారు.

## రవాణా , హమాలీ ఖర్చులు నేటికీ చెల్లించలేదు



**నెల్లూరు, కలెక్టరేట్, నవంబరు 27 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గం సంబంధించి 2022వ సంవత్సరం మార్చి నెలలో జరిగిన వరి కోతలకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రవాణా ఖర్చులు, హమాలీ ఖర్చులను నేటికీ చెల్లించలేదని, ఈ మేరకు సోమవారం కోవూరు టీడీపీ నేతలు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆ కోతలకు సంబంధించి ఒకటిన్నర సంవత్సరం దాటినా నేటికీ నిధులు చెల్లించకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. జిల్లా అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు విడుదల చేసేలా దృష్టి పెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, ఎం. శ్రీనివాసులురెడ్డి, సీహెచ్ కృష్ణచైతన్య, వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## శ్రీలలితా రుద్రమహాయాగం-వైభవంగా పూర్ణాహుతి షోడశమహాలక్ష్మీ, సుహాసిని పూజ



**సంగం నవంబర్ 27 ప్రభాతవార్త:** సంగం తిరమనకొండపైన వెలసియున్న శ్రీరాజరాజేశ్వరీ దేవి,కాశీవిశ్వేశ్వరస్వామి వారి సన్నిధిలో గత 45 రోజుల నుండి జరుగుతున్న శ్రీలలితా రుద్రమహాయాగం కార్యక్రమంలో భాగంగా రాజరాజేశ్వరానందస్వామి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కార్తికపౌర్ణమి,సోమవారం పురస్కరించుకొని కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు,పూజలు చేశారు.అలాగే అమ్మవారికి షోడశ మహాలక్ష్మి పూజ,సుహాసిని పూజ నిర్వహించారు.స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు, అనంతరం అమెరికా నుండి వచ్చిన యోగులను రాజరాజేశ్వరనాందస్వామి దంపతులు సన్మానించారు.అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వామి మాట్లాడుతు



ధ్యానం యొక్క విశిష్టత,ప్రాణాయామం గురించి వివరించి చేయించారు.ధ్యానం ద్వారా ఆత్మజ్ఞానం కలుగుతుందని చెప్పారు. చుట్టుపక్కల మండలాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు.కాశీవిశ్వేశ్వరస్వామి,రాజరాజేశ్వరీ అమ్మవారిని దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



**కావలి రూరల్, నవంబరు 27 ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్ కోసం, వారికి ఉన్నత స్థాయి కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలోని బాలికల గురుకుల పాఠశాలను ఎన్ఆర్ఐలు అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్ దంపతులతో కలిసి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి నాగమణిలు సందర్శించారు. వీరికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అమరా బచ్చు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పాఠశాలలో వసతులు కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. గతంలో కూడా కొండబిట్రగుంటలో అన్నదాన సత్రానికి, అల్లూరులోని వైద్యశాలలో పరీక్షలు చేసే పరికరాలను, నార్తుఆమలూరులో స్కూల్ భవనం,షాపింగ్ కాంప్లెక్స్‌లను ఈ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అంతేకాకుండా రెసిడెన్షియల్ స్కూలులో కొన్ని వసతులు కల్పించేందుకు వారు ముందుకు రావడం సంతోషంగా వుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఉన్నత చదువులు చదువుకొని పది మందికి ఉపయోగపడాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ పాఠశాలకు ప్రహరీ గోడ కావాలని అడిగారని దాన్ని కూడా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులు చేసిన కోలాట నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దేశ్వరస్వామి సన్నిధిలో కార్తిక దీపోత్సవం




**సీతారామపురం నవంబర్ 27 ప్రభాతవార్త :** కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని సీతారామపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్దేశ్వరం ఆలయానికి భక్తులు పోటేత్తారు.మహిళలు కార్తికదీపాలు పెట్టి స్వామి వారిని అత్యంత భక్తి శ్రద్దలతో పూజించారు. సిద్దేశ్వరస్వామిని అమ్మవారిని దర్శించుకొని మహిళలు పరవశించారు.జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రముఖులు సిద్దేశ్వర క్షేత్రాన్ని దర్శించుకున్నారు.మండల ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి సోమవారం స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.తొలుత ద్వజస్తంభం కార్తికదీపాలు వెలిగించారు.శివాలయం వద్ద పూజలు,అభిషేకం నిర్వహించారు పరమేశ్వరుడ్ని దర్శించుకున్నారు.ఇష్టకామేశ్వరీ ఆలయంలో అమ్మవారి దగ్గర కుంకుమార్చన చేసి ఇష్టకామేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆమెకు ప్రసాదాలు అందజేశారు.ఈకార్యక్రమంలో మండల జెసిఎస్ కన్వీనర్ బాలినేని మాబపయ్య పాల్గోన్నారు.

## సియం జగన్మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రితో పలు విషయాలు తెలియజేశారు. మర్యాద పూర్వకంగా సియంని కలిసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తాడేపల్లి సియం కార్యాలయంలో ముఖ్య మంత్రిని ఆయన ఆయన కలిశారు.

## భక్తిశ్రద్ధలతోచేజర్లలో కార్తీక సోమవారం వేడుకలు



**చేజర్ల,నవంబర్27,ప్రభాతవార్త :** మండలంలోని శివాలయాలు రెండవ కార్తీక సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చేజర్ల మండలంలోని కోటితీర్థం లో ఉన్న కోటేశ్వరరస్వామి ఆలయం, తూర్పుకంభంపాడు లో ఉన్న శివాలయంలో మహిళలు భారీగా చేరుకొని కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే చేజర్లలో ఉన్న శివాలయంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చేజర్లలోని లుంబినీ ప్రవేటు విద్యాలయంలో కార్తీక సోమవారం వేడుకలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పాఠశాల కరస్పాండెంట్ రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు సోమవారం ఉదయం శివాలయాలకు వెళ్ళి సముద్ర స్నానమాచరించి పరమేశ్వరునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలువురు కేదారస్వామి వ్రతాన్ని ఆచరించారు. కార్తీకం పవిత్ర ఆధ్యాత్మిక మాసం. పౌర్ణమినాటి చంద్రుడు కృత్తికానక్షత్రం సమీపంలో ఉండడంతో ఈ మాసానికి కార్తీకమాసంగా పేరు వచ్చిందని వేదపండితులు శశిస్వామి తెలిపారు. జడత్వం నుండి జాగృతి దిశగా మనిషిని చైతన్యవంతం చేసే పర్వదినంగాను, ఆరోగ్యపరమైన మాసంగా కార్తీకమాసం ఘనతికెక్కింది. త్రికరణశుద్ధిగా కార్తీక సోమవార వ్రతాన్ని ఆచరించినవారు కైలాసాన్ని చేరకుంటారని కార్తీక పురాణం చెబుతుంది. పరమశివుని కరుణా కటాక్షాలతో వర్షాలు సంమృద్ధిగా కురవాలని రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా , సంతోషంగా ఉండాలని పలువురు భక్తులు శివాలయాల్లో ప్రార్థించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ ఈచేశారు.

## మేకపాటి వ్యవసాయ కళాశాలలో క్రీడాపోటీలు



**ఉదయగిరి,నవంబర్27,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో 27వ తేదీ నుండి 28వ తేదీ వరకు విశ్వవిద్యాలయస్థాయిలో వ్యవసాయకళాశాల బాపట్లలో నిర్వహించ తలపెట్టిన అంతర కళాశాలస్థాయి మొదటిదశ క్రీడలు సాంస్కృతిక,సాహిత్య పోటీలకు అర్హత సాధించిన 22మంది బాలర బృందాన్ని పాల్గొనే నిమిత్తం వ్యవసాయ అర్థశాస్త్ర విభాగాచార్యులు డాక్టర్ కె.ఎస్.ఆర్ పాల్ కళాశాల వ్యాయామ క్రీడా సంచాలకులు బి.రమణ నేతృత్వంలో పంపడం జరిగిందని కళాశాల అసోసియేట్‌డీన్ గోపికృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా అపరమేధావి,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు డాక్టర్ పి.అనీల్‌కుమార్,డాక్టర్ ఎమ్.కిషన్‌తేజ్,డాక్టర్ వై.బాలచంద్ర,డాక్టర్ ఎం.అశోక్‌కుమార్‌నాయక్ పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## అప్పసముద్రంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**ఉదయగిరి,నవంబర్27,ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని అప్పసముద్రం గ్రామంలో ఈ నెల 29వ తేదీ జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు,కార్యకర్తలకు జడ్పిటిసి సభ్యులు మోడి రామాంజనేయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటిరాజగోపాల్‌రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని గడపగడపకు ఆయన వెళ్లిన ప్రతిచోటా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు.జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు,ఇంటివద్దకే చేరుతున్నాయని ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి పరిపాలన అందించిన దాఖలాలు చరిత్రలో లేవని తెలిపారు.గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మేకపాటిరాజగోపాల్‌రెడ్డి ప్రతి ఇంటిని సందర్శించడం జరుగుతుందని గ్రామంలో ఎవైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకుని వెళ్లాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ అభిమానులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అళహరి వెంకటేశ్వరరావు నేత్రదానం



**కావలి, నవంబరు 27 ప్రభాతవార్త :** కావలి పట్టణం కచ్చేరిమిట్టకు చెందిన అళహరి వెంకటేశ్వరరావు(84) వృద్దాప్యంతో మృతి చెందారు. కావలి రెడ్‌క్రాస్ సహకారంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నెల్లూరు మోడరన్ కంటి ఆసుపత్రి సిబ్బంది కార్నియాలను సేకరించారు. నేత్రదాత కుమారుడు శ్రీధర్ మాట్లాడారు. తమ సమీప బంధువు రెడ్‌క్రాస్ రక్త కేంద్రం నిర్వహణ కమిటీ సభ్యుడు డాక్టర్ నక్కా రేవంత్‌కుమార్ ప్రేరణతో తమ తండ్రి నేత్రాలను దానం చేయడం జరిగిందన్నారు. చనిపోయిన వారి నేత్రాలను కాటికి పంపకుండా కార్నియాలను దానం చేసి ఇద్దరి అంధులకు చూపు కల్పించడం ఎంతో ఆనందంగా వుందన్నారు.ఈ కార్యక్రమంలో నేత్రదాత కుటుంబ సభ్యులు అళహరి ప్రమీలమ్మ, గిరిధర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నక్కా సాయిరాం,డాక్టర్ రమ్య, మోడరన్ వైద్యశాల టెక్నిషీయన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.